అంబేడ్కర్ విగ్రహావిష్కరణ బృహత్తర ఘట్టం

- దళిత, బహుజన, మైనార్టీ, ప్రజా సంఘాల నాయకుల హర్షం
- నగరం నుంచి విజయవాడకు భారీగా తరలి వెళ్లనున్న నేతలు

నెహ్రూనగర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు రాష్ట్ర ప్రభుత్వం మరో అరుదైన గౌరవం కల్పించడంతో దళిత, బడుగు, బలహీన, బహుజన, మైనార్టీ, ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని శంకుస్థాపన చేసి గాలికొదిలేసిందని విమర్శిస్తున్నారు. చెప్పిన మాట విధంగా సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి విజయవాడలో అంబేడ్కర్ స్మృతి వనం ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమని కొనియాడుతున్నారు. పీడిత కులాలకు రాజ్యాంగం ద్వారా సమాన హోదా కల్పించి వారికి సమాజంలో గౌరవం కల్పించిన అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డులో 206 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేయడం శుభపరిణామని పేర్కొన్నారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అంబేడ్కర్ ఆలోచన విధానాలకు అనుగుణంగా నడుస్తున్న ఆయనకు రుణపడి ఉంటామంటూ తెలిపారు.

మాట తప్పిన గత ప్రభుత్వం



సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని 206 అడుగుల విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డులో ఏర్పాటు చేయడం దళిత, బహుజన, మైనార్టీలు గర్వించదగ్గ విషయం. గత టీడీపీ ప్రభుత్వం అమరావతిలో అంబేడ్కర్ స్మృతి వనం ఏర్పాటు చేస్తామని చెప్పి శంకుస్థాపన చేసి వదిలేసింది. కానీ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన విధంగానే విగ్రహం ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయం.

– మేడిద బాబూరావు, ఏపీ ఎస్సీ వెల్ఫేర్ సెక్రటరీ జనరల్

చరిత్రలో నిలిచిపోతుంది



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సమాన హోదా కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన అంబేడ్కర్ ఆలోచన విధానాలను పక్కాగా అమలు చేస్తున్న గొప్ప అంబేడ్కర్ వాది సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి. చరిత్రలో నిలిచిపోయే విధంగా విజయవాడలో 206 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడం శుభపరిణామం.

– మద్దు ప్రేమజ్యోతిబాబు, క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు

చారిత్రాత్మక కట్టడం



విజయవాడ కేంద్రంగా 206 అడుగుల చారిత్రాత్మక కట్టడాన్ని సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించడం చరిత్రలో నిలిచిపోయే అంశం. ప్రపంచ వ్యాప్తంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఎనలేని గుర్తింపు ఉంది. ఏపీలో ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ విగ్రహం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిపోతుంది.

– సోమి కమల్, రెల్లి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు

పీడీత వర్గాలకు గౌరవం



ఆనాడు అంబేడ్కర్ దళిత, బహుజన, పీడిత, మైనార్టీలకు సమన్యాయం కల్పించి సమాజంలో తమకంటూ ఒక గుర్తింపు అందించారు. నేడు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ కేంద్రం 206 అడుగుల విగ్రహం ఏర్పాటు చేయడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పీడిత వర్గాలకు గౌరవం చేకూర్చే అంశం.

–అన్నవరపు మల్లేశ్వరరావు, నేషనల్ ధోబీ మహా సంఘ్ జాతీయ అధ్యక్షులు

కేఎల్ వర్సిటీ అధ్యాపకురాలికి పీహెచ్‌డీ



గుంటూరు ఎడ్యుకేషన్: వడ్డేశ్వరంలోని కేఎల్ వర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ చల్లపల్లి ఝూన్సీరాణికి వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వర్సిటీ (విట్-ఏపీ) పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. గుంటూరు నగరానికి చెందిన ఆమె ''యాజ్ ఎఫెక్టివల్ సిస్టం ఫర్ పొజ్ ఎస్టిమేషన్ అండ్ క్లాసిఫికేషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ డాన్స్ ఫామ్స్ యూజింగ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్'' అనే అంశంపై సాఫ్ట్‌వేర్ అండ్ సిస్టం ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ దేవరకొండ నాగరాజు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈ సందర్భంగా డాక్టర్ చల్లపల్లి ఝూన్సీరాణి మాట్లాడుతూ తన పరిశోధన ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి శాస్త్రీయ నృత్య ప్రదర్శనలోని మెళకువలను సులువుగా నేర్చుకోవచ్చునని వివరించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యను అభ్యసించిన తాను డాక్టరేట్ పట్టా అందుకోవడం గర్వంగా ఉందన్నారు.

క్లుప్తంగా

22ను సెలవు దినంగా ప్రకటించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ఈనెల 22ను సెలవు దినంగా ప్రకటించాలని హిందూ ఉపాధ్యాయ సమితి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.ఆర్.వి. ప్రసాదరెడ్డి, ఎం. కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భరతజాతికి ఆదర్శ ప్రాయుడు, కుటుంబ వ్యవస్థకు మూల పురుషుడైన శ్రీరాముని ఆలయ ప్రారంభోత్సవం, ప్రాణ ప్రతిష్ట హిందువుల చిరకాల స్వప్నమని, 500 ఏళ్ల కల సాకారమవుతున్న రోజును ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్పించిన మత స్వాతంత్ర్యపు హక్కును స్వేచ్ఛగా పాటించే అవకాశాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

16 నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కొరిటిపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16వ తేదీ నుంచి మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు డైరెక్టర్ జి.బి.కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ 30 రోజుల పాటు ఉంటుందని వెల్లడించారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో పాటు వసతి సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్టుసైజు ఫోటోలతో యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం శిక్షణ సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట, 0863-2336912, 9700687696, 8125397953, 9949930155 నంబర్లను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

వ్యక్తి అదృశ్యం



గుంటూరు ఈస్ట్: వ్యక్తి అదృశ్యంపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యానగర్‌కు చెందిన 50 సంవత్సరాల చంద్ర రవికుమార్ ఈనెల 12వ తేదీ ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831343 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కోడి పందేలరాయుళ్ల అరెస్టు



గుంటూరు రూరల్: కోడి పందేలరాయుళ్లను అరెస్ట్ చేసిన సంఘటన గురువారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం... స్టేషన్ పరిధిలోని ఓబులునాయుడుపాలెం శివారుల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న స్పెషల్ బ్రాంచి పోలీసుల సమాచారం మేరకు దాడి చేశామని తెలిపారు. కోడి పందేలు నిర్వహిస్తున్న 10 మంది, కోడితో పాటు రూ. 1.82 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించనున్నట్లు తెలిపారు.

శేకూరులో వీవీఐటీ సేవా శిబిరం ప్రారంభం



చేబ్రోలు: మండలంలోని శేకూరులో వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల (వీవీఐటీ) ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవా శిబిరం గురువారం ప్రారంభమైంది. ఈ నెల 24 వరకు వారం రోజుల పాటు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, మెడికల్ క్యాంప్‌లను నిర్వహించనున్నారు. మొదటి రోజు మహిళా సాధికారత, బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంతో పాటు గ్రామంలోని ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దారు కె.వి.గోపాల కృష్ణ మాట్లాడుతూ బాలికల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. ఆడపిల్లలను గౌరవించాలని, వారిని చదువుల తల్లిగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు సూచించారు. సమాజంలో దేనికీ తీసిపోరు అని రుజువు చేయాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. యుక్త వయస్సులో కలిగే ఆకర్షణలు లక్ష్యాలను దూరం చేస్తాయని , వాటికి యువత దూరంగా ఉండాలని చెప్పారు. ఉన్నత స్థానాల్లో ఉన్న వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు బేటీ బచావో.. బేటీ పడావో నినాదాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీవో ఐ.ఎల్.జె.భక్తసింగ్, బి.వి.సతీష్ కుమార్, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

మేయర్ కావటి, సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా



వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మేయర్ కావటి, నూరిఫాతిమా తదితరులు

పట్నంబజారు: నగరాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని మంత్రివారి వీధిలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద రూ. 35 లక్షలతో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రైయిన్లకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు రోడ్లను గుంతలమయంగా మారిస్తే, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రతి రోడ్డును అభివృద్ధి బాట పట్టించినట్లు చెప్పారు. గుంటూరు నగరాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారుస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో 98 శాతం అభివృద్ధి పనులు పూర్తి కావడం సంతోషదాయకమని పేర్కొన్నారు. అభివృద్ధి అనేది మాటల్లో కాదని, చేతల్లో చేసి చూపిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌కే దక్కుతోందని తెలిపారు. ముందుగా దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకూరి శ్రీను, వైఎస్సార్ సీపీ నేతలు ఎం.సుధాకర్‌రెడ్డి, ముస్తఫా, మురళి, రమణకుమార్, ఏఈ సునీల్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం గురువారం 50, 55 డివిజన్ల పరిధిలోని యూపీహెచ్‌సీ కేంద్రంలో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా హాజరై, ప్రజలకు అందుతున్న వైద్య సేవల్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, కార్పొరేటర్ అంబేడ్కర్, వైఎస్సార్ సీపీ నేతలు రాజేష్, రవిరాజు, సూరజ్, స్వర్ణ పాల్గొన్నారు.

క్రాఫ్ట్ రిసోర్స్ వర్క్‌షాప్‌కు ఉపాధ్యాయురాలి హాజరు



గుంటూరు రూరల్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు వర్క్‌షాపులు ఎంతో ఉపయోగపడతాయని నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు పద్మ కోటి తెలిపారు. ఉదయ్‌పూర్‌లో గురువారం కల్చరల్ క్రాఫ్ట్ రిసోర్స్ సెంటర్‌లో సీసీఆర్‌టీ ఉదయ్‌పూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆమె పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లో దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాలకు చెందిన 97 మంది పాల్గొన్నారని, అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి వివిధ జిల్లాలకు చెందిన ఎనిమిది మంది హాజరయ్యారని తెలిపారు. అందులో తానుండటం సంతోషకరమన్నారు. వర్క్‌షాపులో సీసీఆర్‌టీ అందించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కిట్ ద్వారా విద్యార్థులకు నైపుణ్యతలు కలిగిన బోధన అందిస్తామని తెలిపారు. తనకు ఈ అవకాశాన్ని కల్పించిన డీఈవో శైలజ, పాఠశాల ప్రధానోపాధాయయురాలు జ్ఞాన ప్రసూనకు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనుల్ని వేగవంతం చేయండి

అధికారులకు కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం



బీఆర్ స్టేడియం అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో అభివృద్ధి పనులు వేగంగా జరగాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అధికారుల్ని ఆదేశించారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఆమె గురువారం ఏటుకూరు రోడ్డులోని బృందావన్ అపార్ట్‌మెంట్స్ నుంచి నిర్మాణంలో ఉన్న డ్రెయిన్ పనులు, బీఆర్ స్టేడియం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనుల్ని నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళికాధికారులు, శాప్ అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల వేగవంతానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెండర్ పొందిన కాంట్రాక్టర్లు పనుల్ని వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. పట్నంబజార్ నుంచి కబాడీగూడెం వరకు ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్య శాశ్వత పరిష్కారం కోసం 820 మీటర్ల సీసీ స్ట్రాం వాటర్ డ్రెయిన్‌ను రూ.3.53 కోట్లతో నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. డ్రెయిన్ నిర్మాణ ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు చేపట్టాలని పట్టణ ప్రణాళిక అధికారుల్ని ఆదేశించారు. నిర్మాణ పనులు వేగంగా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ జరిగేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని కమిషనర్ చెప్పారు. అనంతరం బి.ఆర్.స్టేడియంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్ని శాప్ అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత గడువు పెట్టుకొని చేయాలని, తూర్పు నియోజకవర్గంలో ప్రజలందరికీ ఉపయోగంగా స్టేడియాన్ని తీర్చిదిద్దాలని ఆదేశించారు. స్టేడియానికి అవుట్ సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులు నగరపాలక సంస్థ చేపడుతుందని, శాప్ ఇంజినీరింగ్ అధికారులు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా మాట్లాడుతూ స్టేడియంలో జరిగే అభివృద్ధి పనులు క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. క్రీడలకు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ శ్రీధర్, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు మీరావలి, అబీద్ బాష, వేముల జ్యోతి పద్మజ, ఏఈ సునీల్ కుమార్ తెలిపారు.

అరవై ఏళ్ల అపూర్వ కలయిక



కళాశాలలో 1964 బ్యాచ్ వైద్య విద్యార్థులు

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదివి 60 ఏళ్లు పూర్తి చేసుకున్న 1964 బ్యాచ్‌కు చెందిన సుమారు 40 మంది వైద్యులు గురువారం కలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి అమెరికా, లండన్, ఇతర దేశాల నుంచి వైద్యులు హాజరయ్యారు. చదువుకున్న కళాశాలలో అన్ని తరగతి గదులు తిరిగి, నాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి పూర్వ వైద్య విద్యార్థులు అందిస్తున్న సహకారం మరువలేనిదని ఆయన అభినందించారు. సుమారు 75 నుంచి 80 సంవత్సరాల వయస్సులో కూడా సీనియర్ వైద్యులుగా ఉంటూ బిజీ ప్రాక్టీస్‌లో కూడా కళాశాలలో కలుసుకునేందుకు అందరూ హాజరవడం సంతోషంగా పలువురు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ డాక్టర్ యలమంచిలి శివాజీ, డాక్టర్ బాల భాస్కరరావు, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ నాయుడమ్మ, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ బాబు, డాక్టర్ ఉమామహేశ్వరావు, డాక్టర్ బాలభాస్కరరావు పాల్గొన్నారు. అనంతరం వైద్యులు జీజీహెచ్‌ని సందర్శించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్‌తో కలసి ఎంసీహెచ్ బ్లాక్‌ను సందర్శించారు.

సెల్‌ఫోన్ లాక్కొని ఆటోడ్రైవర్ పరారీ

గుంటూరు ఈస్ట్: వ్యక్తిని ఆటోతో ఢీకొట్టడంతో పాటు సెల్‌ఫోన్ లాక్కొని పరారీ అయిన డ్రైవర్‌పై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎం.వెంకటప్రసాద్ పేపర్ బోయ్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 15వ తేదీ ఉదయం అరండల్‌పేట 3వ లైనులో సైకిల్‌పై వెళుతున్న సమయంలో గుర్తు తెలియని డ్రైవర్ ఆటోతో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వెంకట ప్రసాద్ కిందపడ్డాడు. ఆటోలోని వ్యక్తి అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యాడు. ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేద బ్రాహ్మణ విద్యార్థినికి లాప్‌టాప్ బహూకరణ



గుంటూరు రూరల్: పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరి సతీష్‌శర్మ తెలిపారు. గోరంట్ల ఇన్నర్ రింగ్ రోడ్‌లోని సమాఖ్య రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాను, సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పులిపాక ప్రసాద్ ఆధ్వర్యంలో బాపట్ల ఇంజినీరింగ్ కాలేజ్‌లో బీటెక్ సెకెండ్ ఇయర్ చదువుతున్న గుధిమెళ్ల తిరుమలమధులతకు రూ. 40 వేల విలువ చేసే లాప్‌టాప్ అందజేసినట్లు తెలిపారు. పొన్నూరు పట్టణానికి చెందిన ప్రముఖ ఆడిటర్ పులిపాక ప్రసాద్ సతీమణి గీతాదేవి జ్ఞాపకార్థం వారి పిల్లలు పృథ్వీకృష్ణ ,భావని ప్రతి ఏడాది వారి తల్లి పేరిట చేసే సహాయ కార్యక్రమాలలో భాగంగా ఈ లాప్‌టాప్‌ను అందజేసినట్లు వివరించారు. విద్యకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో ప్రతి ఏడాది నిరుపేద బ్రాహ్మణుల విద్యకు సహకారం అందిస్తునట్లు పులిపాక ప్రసాద్ తెలిపారు.

21న 'మండలిలో మాస్టారు' పుస్తకావిష్కరణ



ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, కళాధర్

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం శాసనమండలిలో 16 ఏళ్లపాటు చేసిన ప్రసంగాల సంకలనం ''మండలిలో మాస్టారు'' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఈనెల 21న నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం ఆహ్వాన పత్రికల్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఎన్జీవో కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొననున్న శాసనమండలి చైర్మన్ కె.మోషేన్ రాజు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి, బలహీనవర్గాలు తదితర అంశాలపై బాలసుబ్రహ్మణ్యం శాసనమండలిలో ప్రస్తావించారని చెప్పారు. ఎమ్మెల్సీలు ఐ. వెంకటేశ్వరరావు, పి.రఘువర్మ, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ పాల్గొననున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. ఆదిలక్ష్మి, ఎం. కళాధర్, బి. ప్రసాద్, జి.వి.వి. సుబ్బారాయుడు పాల్గొన్నారు.

నిత్య కృషితోనే విజయ సాధన



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: నూతన ఆవిష్కరణల్లో విద్యార్థుల ఆలోచనలు విజయం సాధించే వరకు నిత్యం కృషి చేయాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరంలోని కళాశాలలో గురువారం డిజైన్ థింకింగ్, క్రిటికల్ థింకింగ్, ఇన్నోవేషన్ డిజైన్ అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను బెంగుళూరుకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ సంస్థ ఐబీఎం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా కాగ్నిటివ్ డేటా సైంటిస్ట్ దాసరి నేహకృష్ణ పాల్గొన్నారు. విద్యార్థులకు నూతన ఆవిష్కరణలు వాటి ప్రాధాన్యత, ఉపాధి అవకాశాలను వివరించారు. కళాశాల అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నూత ఆవిష్కరణలను గురించి సమాజాభివృద్ధికి ఉపయోగకరంగా ఆలోచన చేయాలని తెలిపారు. నేహకృష్ణ మాట్లాడుతూ యంత్రాలు, వస్తువులు, వివిధ నూతన పరికరాలకు వాటి డిజైన్ విశేష ఆకర్షణగా నిలవాలని సూచించారు. నూతన ఆవిష్కరణల నమూనాల తయారీలో రూపొందించే డిజైన్ ప్రాథమిక అంశంతో పాటూ విజయానికి ప్రాధాన్యత సంతరించుకుంటుందని తెలిపారు. ఇన్నోవేషన్ హబ్‌గా భారత దేశాన్ని నిర్మించాలనే దృఢ సంకల్పంతో విద్యార్థుల ఆలోచన ఉండాలని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, డాక్టర్ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ స్వర్ణ, డాక్టర్ ఎస్. రాధిక, డాక్టర్ కె. కార్తీకపవన్, డాక్టర్ అపర్ణ పాల్గొన్నారు.

125 లీటర్ల పురుగు మందులు స్వాధీనం

నగరంపాలెం: లైసెన్స్ లేకుండా అక్రమంగా నిల్వ చేసిన పురుగు మందులు/బయోస్టిమ్యులెంట్స్ ఉత్పత్తులను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు గుర్తించారు. పార్శిల్ కార్యాలయాల్లో పట్టుబడిన సరుకు విలువ సుమారు రూ.5.32 లక్షలు ఉంటుందని తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో గురువారం గుంటూరు నగరంలోని రెండు పార్శిల్ కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టారు. తొలుత ఏఎస్ఎల్ పార్శిల్ కార్యాలయంలో తనిఖీలు చేయగా, ప్రసిద్ధ కంపెనీకి చెందిన 125 లీటర్ల సిమోడిస్ పురుగు మందును గుర్తించారు. దీన్ని పల్నాడు జిల్లా వినుకొండ వాసి బి.శివకృష్ణ అనే వ్యక్తి తెలంగాణలో తక్కువ ధరకు కొనుగోలు చేసి, బిల్లులేకుండా ఏఎస్ఎల్ పార్శిల్ ద్వారా సొంతూరుకు రవాణా చేస్తున్నట్లు తనిఖీలో వెల్లడైంది. రూ.3.32 లక్షలు ఖరీదు చేసే 125 లీటర్ల పురుగు మందును స్వాధీనం చేసుకుని, 6ఏ కేసు నమోదు చేశారు. ఇక సింధూ పార్శిల్ కార్యాలయంలోనూ తనిఖీలు కొనసాగాయి. వ్యవసాయ శాఖ నుంచి అనుమతుల్లేకుండా నిల్వచేసిన బయో ఉత్పత్తులను గుర్తించారు. రూ.2 లక్షలు ఖరీదు చేసే 210 లీటర్ల గ్లోబస్ అనే బయోస్టిమ్యులెంట్స్ విక్రయాలను నిలుపుదల చేశారు. పురుగు మందులు, బయోస్టిమ్యులెంట్స్ ఉత్పత్తులను వివిధ పార్శిల్ వాహనాల్లో గుంటూరు తరలిస్తున్నట్లు తనిఖీల్లో బహిర్గతమైంది. అదీకాకుండా లైసెన్స్ లేకుండా విక్రయిస్తున్నారని, ఇటువంటి అక్రమదారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ వ్యవసాయ అధికారి (ఏఓ) రమణ కుమార్, సీఐలు ఎ.శ్రీహరిరావు, ఎస్.శ్రీనివాసులురెడ్డి, వ్యవసాయ అధికారి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషిచేయాలి

చేబ్రోలు: గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా కృషి చేయాలని చేబ్రోలు మండల తహసీల్దారు కె.వి. గోపాలకృష్ణ తెలిపారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో పీపుల్స్ ప్లాన్ క్యాంపెయిన్ 2023-24పై రెండు రోజుల శిక్షణ గురువారం ప్రారంభమైంది. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అబియాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి చేబ్రోలు మండలంలోని అన్ని గ్రామాల సచివాలయ సిబ్బంది, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు.

ముట్లూరులో మందుబాబుల వీరంగం

సచివాలయం, ఎండీయూ వాహనం అద్దాలు ధ్వంసం



పగలగొట్టిన సచివాలయం కిటికీ అద్దాలు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం ముట్లూరులో మందుబాబులు వీరంగం సృష్టించారు. బుధవారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు పూటుగా మద్యం తాగి గ్రామంలోని సచివాలయం-1, సచివాలయం -2 కిటికీల అద్దాలు ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా గ్రామంలో నిలిపి ఉంచిన ఎండీయూ వాహనం అద్దాలను సైతం పగలగొట్టారు. ఇది మందుబాబుల పనేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా గురువారం ఉదయం సచివాలయం తీసేప్పటికి అద్దాలు పగిలిఉండటం, గాజు పెంకులు చెల్లాచెదురుగా పడి ఉండటంతో పంచాయతీ కార్యదర్శి బి. సుబ్బారావు పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

అంబేడ్కర్ ఆశయాలను సాకారం చేస్తున్న సీఎం జగన్

సీఎం జగన్‌కు అభినందనలు

పొన్నూరు: అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తూ రాష్ట్ర ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అభినందనీయులని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెరికల కృష్ణమోహన్ తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ సృష్టికర్త అంబేడ్కర్‌కు నివాళిగా విజయవాడ స్వరాజ్ మైదానంలో 206 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి, ఆయన్ను గౌరవించిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. విజయవాడలో శుక్రవారం వైభవంగా జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో నియోజకవర్గ ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్, నాయకులు మల్లెల రాజు, వేముల మూర్తి రాజు, రూరల్ నాయకులు పిల్లి మాణిక్యరావు, ఎండేటి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.